# నాన్నలూ జాగ్రత్త!

(స్వాతి మాస పత్రిక, May, 1998)

"అమ్మా మీ అల్లుడు స్కూటర్ కావాలంటున్నారు. అదీకాక పిల్లల్ని కాన్వెంటుకు తీసుకెళ్ళడానికి, తీసుకురావటానికి క్కూడా సౌకర్యంగా వుంటుంది రిక్షాలకి రెండు, మూడువందలవుతున్నయ్" పెద్ద కూతురు తల్లితో అన్నది.

"మీ నాన్నని అడుగు. నాకా విషయాలేం తెలుసు....నేనేం వద్దటానా....ఆయన ఇష్టం" సమాధానం చెప్పింది తల్లి.

"రవిని (మా మనవడు) కాన్వెంట్‌లో చేర్పించాలంటే డొనేషన్ అడుగుతున్నారమ్మా. నాన్నకు చెప్పి నాకో అరవై వేలు ఇప్పించవే" అభ్యర్థనగా అన్నాడు అమ్మతో చిన్నకొడుకు.

"అందరూ నన్నడిగితే నేనేం చేయగలన్రా. మీకు తెలియందేముంది. అంతా మీ నాన్న ఇష్టమేగా. ఆయన్నే అడిగి చూడండి" అనునయంగా అన్నదామె.

"సరేలే. ఆయన్ని అడిగేకంటే నోర్మూసుకుని కూర్చోవటం మంచిది" కూతురి నిష్టూరం.

"ఆయన్తో చెప్పుకున్నా, ఆ గోడతో చెప్పుకున్నా ఒక్కటే. నువ్వేమన్నా చెప్పి చేయగలిగితే చేయి. లేకపోతే లేదు" కొడుకు ఈసడింపు.

మొన్నమొన్నటిదాకా నా పొట్టమీద కూర్చుని తారమయ్యే.... రఘుకుల రామచంద్రయ్యే అంటూ పాడుతుంటే బోసినవ్వుల్తో చేతులాడించిన నా కన్నపిల్లలు, నా రక్తం పంచుకు పుట్టిన నా బిడ్డలు, బుంగమూతుల్తో, బిక్కముఖాలతో నట్టింట్లో నడయాడిన నా పిల్లలు.

మా నాన్నకి నేను ఒక్కడ్నే కొడుకుని ఇద్దరు కొడుకులకు, ఇద్దరు కూతుళ్ళకు నాన్నను నేను. ఇరవై మూడు సంవత్సరాల క్రితం మొదటిసారిగా నాన్ననయ్యాను. మొదటి సంతానంగా కొడుకుని కని కానుకగా ఇచ్చిం . నా భార్య మగ పిల్లవాడి త. డ్రివంటూ పొగడ్త లలో ముంచెత్తేరు నన్ను ఆత్మీయులంతా

రెండవసారి కూతుర్ని కన్నప్పుడు నేనూ మా ఆవిడా మును పటిలాగే సంతోషించినా, బంధువులు మాత్రం ఆడపిల్ల తండ్రివి జాగ్రత్త అని హెచ్చరించటం నాకు విచిత్రంగా అనిపించింది మగ బిడ్డని కన్నప్పుడు పొగడ్తలూ ఆడపిల్లని కన్నప్పుడు హెచ్చరింపు లూ ఎంతగా ఆలోచించినా అర్థం కావు నాకు.

మరో ఇద్దరు పిల్లల తర్వాత శ్రీమతి కోరి పై ఆపరేషన్ చేయించుకోవటంతో నలుగురు పిల్లల తండ్రినయ్యాను.

నలుగురు పిల్లలకూ వాళ్ళు కోరినవి అన్నీ కాకపోయినా, నా శక్తికి మించకుండా కొనిపెట్టాను. వాళ్ళ కోరికలు కొన్నైనా తీర్చాను చదువు చెప్పించాను. అందరూ పెద్దవాళ్ళయారు. ప్రయో జకులవుతారనే విశ్వాసం నాకుంది.

అందరికోసం అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాను. అయితే ఏం లాభం. నా గురించి నేను జాగ్రత్త పడలేకపోయాను. ఏదో తెలుసు కోలేని తీయని మోసానికి గురయ్యాననిపిస్తున్నది నాకు.

వయసులో వుండగా ఇంట్లోవాళ్ళ అవసరాలు తీర్చేటందుకు జమానులా వ్యవహరించిన నేను అప్పుడూ, ఇప్పుడూగూడా పేరుకు యజమానినే మా ఇంటికి, అయినా ఏం లాభం. ఇప్పుడు నేను ఆ ఇంట్లో ఓ మనిషినికాదు. కరెన్సీ నోట్లనే పూలుపూచే చెట్టుని. కాస్తంత గొప్పగా చెప్పుకోవాలంటే కోరిన కోర్కెలు తీర్చే కల్పవృక్షాన్ని,

ఎవరికైనా డబ్బుతో అవసరం వచ్చినప్పుడు మాత్రమే ఈ నాన్న గుర్తుకొస్తాడు వాళ్ళకి అప్పుడు నాన్నపైన ప్రేమ పుట్టుకొస్తుంది. ఆ డబ్బులు కాసినీ ఇచ్చేసిన మరుక్షణం డబ్బుకు కొరగాడీ నాన్న.

నాతో అంతరంగికంగా మాట్లాడే విషయాలేం వుండవ్ వాళ్లకి ఆత్మీయంగా నా దగ్గర కూర్చునే సందర్భాలు అసలే వుండవ్.

ఇంట్లో నేననేవాడ్ని ఒకడ్ని వున్నానన్న సంగతే ఎరుగనట్లు మసలుకుంటారు.

ఒకప్పుడు నా ఎదుట పడాలంటే పిల్లలందరికీ ఎంతో భయం నా ముందు నిలుచునేందుకు సాహసించే వాళ్లు కాదు. తప్పనిసరై ముందుకు రావాలంటే చాలు ముడుచుకుపోయే వాళ్లు. వంగి వంగి నంగినంగిగా మాట్లాడేవాళ్ళు అమ్మ కొంగు అడ్డుపెట్టుకుని. గుండె చిక్కబటుకుని బెరుకుబెరుగ్గా అడిగేవాళ్ళు ఏదైనాసరే!

ఇవన్నీ నేను కావాలని అలవాటు చేసినవి కావు. పిల్లలకి తండ్రి భయం అవసరం అని వాళ్ళ అమ్మ నమ్మి, పిల్లల్ని అలా అలవాటు చేసింది.

స్కూల్ నుంచి ప్రోగ్రెస్ రిపోర్టు తీసుకు వచ్చి వాళ్ళమ్మకు చూపించేవాళ్ళు చనువుగా. వాళ్ళని ఆమె మందలించేది కాదు పైగా "మీ నాన్నగారికి చూపండి... వంతోషిస్తారు" అని నిష్ఠూరాలాడేది.

ఆ రాత్రికి పడకగదిలో "మీరలా ఏం పట్టించుకోకపోతే వాళ్లు ఎందుకూ పనికిరారు. చిన్నాడికి సోషల్ స్టడీస్‌లో తక్కువ వచ్చినై. పెద్దమ్మాయికి లెక్కల్లో పోయినసారే నయం...." ఇలా ఒక్కొక్కరి మార్కుల గురించి వివరంగా చెప్పేది.

"నువ్వే అడక్కపోయావా" అనేవాడ్ని.

"సరే నా మాటంటే వాళ్ళకి లెక్కేముంది. నా భయం లేకపో

బట్టేగా మిమ్మల్ని బ్రతిమలాడటం. మీరుగనక కాస్తంత మందలించకపోతే వాళ్ళకి మంచి మార్కులు రావు. అనక బాధపడి ప్రయోజనం వుండదు....మీ ఇష్టం" హెచ్చరింపుగా అనేది.

తెల్లవారి స్కూలుకు బయల్దేరబోతూ వణికే చేతుల్తో, బెదురు చూపులతో ప్రోగ్రెస్ కార్డులు చేత పుచ్చుకుని నా దగ్గరకు వచ్చిన వాళ్ళ ముఖాలు చూసి జాలివుట్టేది నాకు.

అమాంతం దగ్గరకు తీసుకుని వాళ్ళని అనునయించి ఏవేవో చెప్పాలనిపించేది నిజానికి వాళ్ళకు వచ్చిన మార్కులు నాకు సంతృప్తిని కలిగించినా శ్రీమతి చేసిన హెచ్చరికలు గుర్తుకువచ్చి గంభీరంగా మారిపోయేవాడ్ని.

అందరికీ తలా ఓ రకంగా హెచ్చరిక చేసేవాడ్ని నా మందలింపులు శ్రీమతికి తృప్తి కలిగించా యనిపించిన తర్వాతగానీ ఆ ప్రహసనం పూర్తిచేసేవాడ్ని కాదు. బిక్కమొహాలేసుకుని, గుడ్ల నీరు కుక్కుకుని వేళ్ళే ఆ పసిమనసుల్లో నేనో రాక్షసుడిలా ఆ విధంగా ముద్ర వేయించుకున్నాను.

అలాంటి సంఘటనల పర్యవసానమేనేమో ఇప్పటి నాదుస్థితికి కారణం అనిపిస్తుంటుంది నాకు ప్రస్తుతం పిల్లల నడవడిక ఎలా వుంటుందంటే టైము తెలియాలంటే గడియారం వంక చూసినట్లు, గాలి కావాలంటే పంకా వేసుకున్నట్టూ, డబ్బు కావాలంటే నా కంట పడతారు. డబ్బు అడుగుతారు. తీసుకువెళ్తారు

స్కూల్లోనో, కాలేజిలోనో చదువుకునే రోజుల్లో పిల్లలందర్తో కలిసి పిక్‌నిక్‌లకు వెళ్ళాలనుకున్నప్పుడు వాళ్ళ అమ్మను అడిగేవాళ్ళు అలిగేవాళ్ళు. బ్రతిమాలేవాళ్ళు.

"నాదేం వుందిరా. మీనాన్నని అడగండి. ఆయన వెళ్ళమంటే నాకేం అభ్యంతరం లేదు" అని అందమైన అబద్ధంచెప్పేది ఆమె,నాతో

"రేపు వాళ్ళంతా పిక్నిక్‌కి వెళ్తామంటున్నారు. ఊర్కే తలా డింతకండి. వాళ్ళకి అప్పుడే ఆ వయసు రాలేదు. ఎన్నెన్నోవార్తలు వింటున్నాం. వీల్లేదని చెప్పండి" ఆజ్ఞాపిస్తున్నట్లు అనేది శ్రీమతి.

"పోనీలే మధూ....పాపం వాళ్ళకిమాత్రం అందర్తో సరదాగా వెళ్లాలని వుండదా" అనేవాడ్ని.

"మీరలా అన్నింటికీ వాళ్ళకి వత్తాసు పలకండి. ఇక నామాట అక్ష్యపెట్టరు. నాకు మాత్రం వాళ్లని పంపటం ఇష్టం లేకనా ఇంకాస్త పెద్దయ్యాక వెళ్తారు" అని ఏదో ఒక సాకు చెప్పేది.

ఆమె చెప్పే సాకు వాళ్ల అనారోగ్యం గురించో, వాతావరణం గురించో ...మరోటో మొత్తానికి నన్ను మెత్తబరిచేది. గెలుపు ఆమెదే అయ్యేది

"నాన్నా ఇవ్వాళ పిక్‌నిక్‌కి వచ్చేవాళ్ళ పేర్లు ఇవ్వడానికిలాస్ట్ డేట్. డబ్బులుకూడా ఇవ్వాళే ఇచ్చేయాలి. నేనుకూడా వెళ్తా నాన్నా"

" .... "

"వెళ్లొద్దా నాన్నా" జాలిగా అడిగిన ఆ ప్రశ్నకు అయిష్టంగా, అతికష్టంగా వద్దని బదులిచ్చేవాడ్ని. ఆ సమయంలో నిరుత్సాహపడ్డ ఆ పసిముఖాన్ని చూసే ధైర్యం వుండేదికాదు నాలో. తప్పుచేస్తున్నా నన్న అవమానభారం నన్ను కృంగదీసేది.

అలా అలా పిల్లల దృష్టిలో నేనొక శత్రువుగా మిగిలిపోయా నేమో !

వాళ్లు పెద్ద వాళ్ళయ్యాక ధైర్యంగా వాళ్లంతట వాళ్లే నా ఎదుటపడి వాళ్ల అవసరాలకు డబ్బు అడిగినప్పుడు కావాలనే కాదనేవాడ్ని.

అలాగైనా వాళ్లచేత కాసేపు ప్రతిమాలించుకోవాలన్న తాప త్రయం. మరికాసేపు వాళ్లు నాతో గడపాలన్న ఆరాటం వలన అలా

అనేవాడ్ని. కానీ నా కోరిక నెరవేరకపోగా, నేను డబ్బు మనిషిననీ పిల్లల అవసరాలు, కోరికలు తీర్చాలన్న జ్ఞానంలేని పశువుననే భావం వాళ్లలో మరింతగా పెరిగింది కాబోలు, నన్ను ఈసడించుకోసాగేరు నిర్లక్ష్యం చేయడం మొదలుపెట్టారు.

అందరికీ పెళ్ళిళ్లు చేశాను మగపిల్లలిద్దరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్ళు, మనుమలు, మనుమరాండ్రు - ఎవరి సంసారాలు వారివి. ఎవరి సంపాదనలు వారివి. ఎవరి ఇష్టాలు వారివి. ఎవరి కష్టాలు వారివి.

కడుపులో మాట చెప్పుకోవాలంటే ఇప్పుడంతా వాళ్లమ్మ చుట్టూ చేర్తారు. సంతోషమైన విషయాలైనా ఆమెతో పంచుకుంటారు. అన్నింటికీ నేనొక ప్రేక్షకుడిగానో, శ్రోతగానో మిగలటం తప్ప మరే అస్తిత్వం లేని మనిషిగా తయారయ్యాను. ఆత్మీయమైన పిలుపుకోసం తపించసాగేను.

నిజానికి, పిల్లలకి సరిగా నడవటం కూడా చేతకాక తప్పటడుగులు వేసేటప్పుడు, తడబడుతూ ముద్దుముద్దు మాటలు మాట్లాడేప్పుడు వాళ్లతో ఏం ఆడుకున్నానో... వాళ్లకి ఊహ వచ్చి, ప్రేమ కావాలనిపించడం ప్రారంభమైన దగ్గర్నుంచీ, నా ప్రేమని వ్యక్తపరచుకునే అవకాశం పోగొట్టుకున్నాను. క్రమశిక్షణ అనే ముసుగులో అర్ధాంగి అభీష్టం మేరకు నన్ను నేనే మోసం చేసుకున్నాను. ఎంతో పోగొట్టుకున్నాను.

బడినుంచి ఆలస్యంగా వస్తే నాన్నకు చెప్తాననీ, మార్కులు తక్కువగా వస్తే నాన్న కోప్పడతాడనీ, పిల్లల్తో ఆటలాడుకుంటుంటే నాన్నకి చెప్పి కొట్టిస్తాననీ .... ప్రతి దానికీ శిక్షించేవాడిగానే పిల్లల మనసులలో తిష్ఠవేసుకున్నాన్నేను. ఓ బూచివాడి పాత్ర పోషించాల్సి వచ్చింది నేను.

పుస్తకాలు పోగొట్టుకున్నా కొత్తగా కొనిచ్చిన కలం పారేసుకున్నా నాకు ఫిర్యాదు చేసి నన్ను శిక్ష వేయమని ఆజ్ఞాపించేది మాధురి.

అలా అమె పిల్లకు ఆత్మీయురాలిగా, నేను పరాయివాడిగా మిగిలిపోయాం పిల్లల మనసులలో. అసలు అమ్మంటే వాస్తవమనీ, నాన్నంటే నమ్మకమనీ చెప్పారు పెద్దలు.

ఎంత విచిత్రమో! నాన్నల పాత్ర పాపం పిల్లలు పుట్టినదగ్గర నుంచీ అమ్మతోపాటు సమానంగా, కొన్నిచోట్ల అంతకంటే ఎక్కువగా కూడా పిల్లల్ని ప్రేమించి గారాబం చేసే నాన్నలు లేరూ! వాళ్లూ కేవలం నమ్మకం అధారంగానే నాన్నలుగా వ్యవహరిస్తున్నారు కదూ! అలోచనలు పరిపరివిధాల పరిగెడుతున్నయ్ నాలో.

నిజమే. ఆర్థికంగా బలంగానే వున్నాన్నేను అందరి అవసరాలమా తీర్చగలిగే స్థితిలోనే వున్నాను కానీ, ఈకాస్తా ఎవరడిగినంత వారికి ఇచ్చేస్తే అటుతర్వాత నా అవసరం అంటూ వారికి ఏమాత్రం వుండదన్న భయమూ, నా ఉనికే వారికి పట్టదేమో నన్న బెదురూ ఒక ప్రక్కన, యెవరికి ఎంతెంత ఇచ్చేయాలనుకున్నానో అంతా ఇచ్చేస్తేనన్నా నన్ను ప్రేమించటం మొదలుపెడతారేమో నన్న ఆశ, నేను డబ్బు మనిషిని కాదని నిరూపించుకోవాలన్న తపన మరో ప్రక్క నన్ను లాగుతున్నాయి.

డబ్బు ఇచ్చి ప్రేమను కొనుక్కోవటమా ? డబ్బు నా దగ్గరే వుంచుకుని ప్రేమ పొందటమా ? అనే సందిగ్ధంలో పడ్డాను! ఆ రెండింటికన్నా ఇన్నాళ్ళ నా మనోవేదననూ పిల్లలతో పంచుకుని వాళ్ళనించి అసలైన అవ్యాజమైన ప్రేమ పొందటం మంచిదనిపించింది. అదే నిర్ణయించుకున్నాను.

ఈ నాన్న మనసుని వాళ్ళు సక్రమంగా అర్థం చేసుకుంటే నేను కృతార్థుడనవుతాను. కాకపోతే మరింత కృంగిపోతాను. దేని కయినా సిద్ధమే.

నా కొడుకు లిద్దరూ నాన్న లయ్యారుగా. కనీసం వాళ్ళనైనా జాగ్రత్త పడమని హెచ్చరించటం నా కనీస కర్తవ్యం అనిపించింది అందుకు నా ప్రయత్నం ప్రారంభించాను.

— o —